
# బట్టతల బ్రహ్మానందం

బ్రహ్మానందం అద్దంలో తన మొహం చూస్తున్నాడు. వెంటనే అతని మొహం వివర్ణమైంది.

మరోసారి పరీక్షగా చూస్కున్నాడు.

తన మొహంలో చాలా మార్పు వచ్చేసింది. తను తన వయసుకంటే పెద్దగా కనిపిస్తున్నాడు. కారణం తెలుసుకోగానే బ్రహ్మానందం డిస్గస్ట్ అయిపోయాడు.




"ఆ...హ్..." అంటూ జుట్టు పీక్కున్నాడు.

చేతిలోకి రెండు డజన్ల వెంట్రుకలు వచ్చాయ్. వాటిని చూడగానే కెవ్వుమని అరిచాడు.

ఆ అరుపుకి వంటింట్లోంచి అతని భార్య మంగతాయారు పరుగెత్తుకు వచ్చింది.

"ఏంటి?...ఏమైంది??" అంటూ కంగారుగా అడిగింది.

బ్రహ్మానందం చేతిలోని వెంట్రుకలు చూపించాడు.

"జుట్టు పీక్కున్నారా?..." అడిగింది.

అవున్నట్టు తలూపాడు బ్రహ్మానందం.

"అద్దం చూస్కోడమెందుకు, బాధపడి జుట్టు పీక్కోడం ఎందుకు, పీక్కున్న

జుట్టుని చూసి మళ్ళీ బాధపడడం ఎందుకు?... మీరిలా జుట్టు పీక్కుంటూపోతే ఎప్పుడో వచ్చే బట్టతల ఇప్పుడే వచ్చేస్తుంది."

బ్రహ్మానందం అంతగా బాధపడడానికి కారణం అది. అతని జుట్టు ఈ మధ్య విపరీతంగా రాలిపోతూంది. ఏం చేస్తే జుట్టు రాలడం ఆగుతుంది?...

ఆలోచించి ఆలోచించి అతని బుర్ర వేడెక్కిపోతూ ఉంది.

"బట్టతల వస్తూందని మీరింతగా ఎందుకు బాధపడ్తున్నారో నాకర్థం కావడంలేదు... బట్టతల వస్తే అంతా లాభమే కదా?..." అంది మంగతయారు.

"లాభమా?... ఎలా?..." ఆశ్చర్యంగా చూశాడు బ్రహ్మానందం భార్యవైపు.

"తలకి రాసుకునే నూనెఖర్చు తగ్గుతుంది... జుట్టు వత్తుగా ఉంటే దువ్వెనలు పళ్ళూడిపోయి విరిగిపోతాయ్... అదే గనుక బట్టతల ఉంటే జీవితాంతం ఒక్క దువ్వెనే వాడొచ్చు. ఆవిధంగా దువ్వెనల ఖర్చు తప్పుతుంది... షాంపూ కర్చుకూడా ఉండదు. ఇప్పుడైతే నెలకోసారి క్రాపు చేయించుకుంటున్నారు... బట్టతల వస్తే రెండు మూడు నెలలకోసారి క్రాపు చేయించుకోవచ్చు. ఆ విధంగా క్రాపు చేయించుకునే ఖర్చుకూడా తగ్గుతుంది... చూశారా ఎంత ఆదానో?..."

బ్రహ్మానందంకి ఒళ్ళు మండిపోయి జుట్టు పీక్కున్నాడు. ఈసారి చేతిలోకి రెండున్నర డజన్ల వెంట్రుకలు వచ్చాయ్.

"కెవ్వు..." అన్నాడు వాటిని చూసి.

"ఊ ఇంకా పీక్కోండి... త్వరగా బట్టతల వస్తే నే చెప్పిన లాభాలన్నీ త్వరగా పొందవచ్చు..." సంబరంగా అంది మంగతాయారు.

"బట్టతల వల్ల నష్టాలు నేను చెప్పనా?" పళ్లు నూరుతూ అన్నాడు బ్రహ్మానందం.

"చెప్పండి...."

"బట్టతల రావడంవల్ల మొహం వైశాల్యం పెరుగుతుంది. ఆ విధంగా మొహం కడుక్కోడానికి ఎక్కువ సబ్బు పడ్తుంది. మొహానికి స్నో, పౌడర్‌లు ఎక్కువ ఖర్చవుతాయి. దువ్వెనదేం ఉంది... రూపాయి పారేస్తే వస్తుంది... కాని - స్నో, పౌడర్లు ఎంత ఖరీదు?... చిన్న మొహానికి చిన్న చిన్న కర్చీఫులు చాలు... కానీ పెద్ద మొహానికి పెద్ద పెద్ద కర్చీఫులు కావాలి. చిన్న కర్చీఫు మూడు రూపాయల్లో దొరుకుతుంది. కానీ పెద్ద కర్చీఫు ఆరురూపాయలకి కొనాలి!... చలికాలంలో చిన్న మొహానికి కాస్త

కోల్డుక్రీం రాస్తే సరిపోతుంది... బట్టతల వచ్చి మొహం పెద్దదయిపోతే ఎక్కువ కోల్డుక్రీం పడ్తుంది. కోల్డుక్రీం ధర నీకు తెల్సుకదా?... ఇవేకాక ఇంకో పెద్ద నష్టం ఉంది... అది నీకు సంబంధించినది."

"మీకు బట్టతల వస్తే నాకేంటి నష్టం?" తెల్లమొహం వేస్తూ అడిగింది మంగతాయారు.

"నాకు బట్టతల వచ్చిందనుకో... నేను బాగా పెద్దవాడిలా కనిపిస్తాను. నువ్వేమో చిన్నదానిలా కనిపిస్తావు. అప్పుడు ఈ పేటలోని అమ్మలక్కలంతా నాకు నువ్వు రెండో పెళ్ళానివని అనుకుంటారు. రెండో పెళ్లివాడిని చేస్కుందంటే ఈమెకి మొదటి పెళ్లివాడు దొరకలేదేమో... దొరక్క దొరక్క విసుగుపుట్టి ఎవడో ఒకడు దొరికితే అంతేచాలులే అనుకుని నన్ను చేస్కున్నావని అనుకుంటారు. బుగ్గలు ఇట్టా... ఇట్టా నొక్కుకుంటారు..."

మంగతాయారు మొహం పాలిపోయింది.

"ఏవండేవండేవండీ... ఎలాగైనాసరే... మీరు బట్టతల రాకుండా చూస్కోండీ..." బ్రతిమలాడింది మంగతాయారు.

"అదే కదా నేనూ ఆలోచిస్తూంది... నేనెంత బాధపడ్తుంటే ఈ జుట్టేమో అంతగా ఊడిపోతూ ఉంది... తల్చుకుంటుంటే పిచ్చెక్కిపోతూ ఉంది..." అంటూ ఆవేశంతో గుప్పిళ్లతో జుట్టు పట్టుకున్నాడు బ్రహ్మానందం.

మంగతాయారు గభాలున అతని చేతులు పట్టుకుంది.

"హమ్మా... హమ్మా... మీరట్టా జుట్టు పీకేస్కుంటే త్వరగా బట్టతల వచ్చేస్తుంది... మీరట్టా జుట్టు పీక్కోకండి... ప్లీజ్..." అంది కళ్లనీళ్లు పెట్టుకుంటూ మంగతాయారు.

బ్రహ్మానందం జుట్టుని వదిలి తన కళ్ళనీళ్లు తుడుచుకుని భార్య కళ్లనీళ్లు కూడా తుడిచాడు.

తరువాత ముక్కు చీదాడు. మంగతాయారు తన ముక్కు ముందుకు చాపింది.

"నీ ముక్కు నువ్వే చీదుకో..." కోపంగా అన్నాడు బ్రహ్మానందం.

"మరి నా కళ్లు నేనే తుడుచుకునే దాన్నిగా... మీరెందుకు తుడిచారు?..."

"హబ్బా... నీతో వాదించడం చాలా తల్నొప్పి..." అంటూ మళ్ళీ జుట్టు పీక్కోబోయాడు.

మంగతాయారు కంగారుపడిపోయింది.

"హమ్మా... హమ్మా... అంతపని చెయ్యకండి... నా ముక్కునేనే

చీదుకుంటాన్లెండి..." అంది చెంపలేస్కుంటూ.

బ్రహ్మానందం జుట్టు ఊడకుండా ఉండడం కోసం రకరకాల హేరాయిల్స్ వాడసాగాడు. కానీ ఫలితం ఏమీ కనిపించడం లేదు.

"రోజూ శీర్షాసనం వేస్తే జుట్టు రాలడం ఆగుతుంది. అంతేకాక, జుట్టు ఎప్పుడూ నల్లగా నిగనిగలాడ్తూ ఉంటుంది... వెంట్రుకలు తెల్లబడవు" అంటూ అతని స్నేహితుడొకడు సలహా ఇచ్చాడు.

ఆ మర్నాడు ఉదయమే స్నేహితుడి సలహా పాటించి తల కిందికి, కాళ్లు పైకి పెట్టి శీర్షాసనం వేశాడు బ్రహ్మానందం. వేసిన వెంటనే "వామ్మోవ్...వాయ్యోవ్..." అంటూ కేకలు పెట్టాడు.

ఆకేకలు విని "ఏమైందండీ?" అంటూ కంగారుగా ప్రశ్నించింది మంగతాయారు.

బ్రహ్మానందం లేచి కాళ్లమీద నిలబడి "వామ్మోవ్...వాయ్యోవ్..." అన్నాడు మళ్లీ.

"అదేంటి?.... మెడెందుకు అలా పక్కకి పెట్టి వింతగా చూస్తున్నారు?"

"వింతగా చూడ్డమా నా బొందా?... నా మెడ ఇరుకు పట్టింది... వామ్మోవ్...వాయ్యోవ్..." బాధగా అరుస్తూ మెడ రుద్దుకున్నాడు.

"ఆ దిక్కుమాలిన శీర్షాసనం ఎందుకేశారు?... మెడ ఎముక విరిగిపోయిందో ఏంటో!... చాలా బాధపడ్తున్నారు - డాక్టర్‌కి చూపించుకోండి." కంగారుగా అంది మంగతాయారు.

బ్రహ్మానందం డాక్టరు దగ్గిరికి వెళ్లాడు.

"మీ మెడ అద్భుతంగా ఇరుకు పట్టింది... ఇంత అద్భుతంగా ఎలా జరిగింది?!..." ఆశ్చర్యంగా అడిగాడు డాక్టర్.

"శీర్షాసనం వేశానండీ..." నసుగుతూ చెప్పాడు బ్రహ్మానందం.

"శీర్షాసనం వెయ్యాలనే అద్భుతమైన ఆలోచన మీకెందు కొచ్చిందసలు?..."

బ్రహ్మానందం వివరించి చెప్పాడు.

"హోస్... ఇంతేనా?... మీకో అద్భుతమైన మందు రాసిస్తాను... లోపలికి వేస్కుని తలకి రాస్కోండి... మీ జుట్టు ఊడదు..." అంటూ చీటీ మీద మందులు రాసిచ్చాడు డాక్టర్.

బ్రహ్మానందం ఆ మందులు వాడాడు. కానీ ఆ మందులు వాడడం మొదలు బెట్టినప్పటినుండీ అతని జుట్టు కుచ్చులు కుచ్చులుగా ఊడిపోవడం మొదలుపెట్టింది. వెంటనే ఆ మందులు వాడడం ఆపేశాడు బ్రహ్మానందం.

ఎవరో బ్రహ్మానందంకి చెప్పారు కోయవాళ్ళ దగ్గర రకరకాల మూలికలు దొరుకుతాయనీ, వాటిని నీటిలో అరగదీసి నెత్తికి రాస్తుంటే పట్టుకుచ్చులా జుట్టు నిగనిగలాడ్తుందనీ...

వెంటనే బ్రహ్మానందం ఫుట్‌పాత్‌మీద మూలికలన్నీ పరచుకుని కూర్చునే కోయదొర దగ్గరకి వెళ్లాడు.

వాడు బ్రహ్మానందం దగ్గర పాతిక రూపాయలు తీస్కుని ఓ వేరు ముక్క ఇచ్చాడు.

"దీన్ని నీళ్లలో అర్గదీసి దాన్ని తలకు పట్టించు దొర... అప్పుడు నీ పెంటి నీ తల జూసి ముర్సిపోతుంది దొర" అన్నాడు కోయదొర రొంటిలో డబ్బులు దోపుకుంటూ.

కోయదొర చెప్పినట్టే చేశాడు బ్రహ్మానందం... జుట్టు రాలడం ఆగడం మాట అటుంచి ఇదివరకటి కంటె ఎక్కువ ఊడిపోసాగింది. దెబ్బకి నొసలు ఒక అంగుళం పైకి జరిగింది.

ఘొల్లుమన్నాడు బ్రహ్మానందం.

రోజులు గడుస్తూ ఉన్నాయ్. బ్రహ్మానందం తన ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు.

కానీ ఈ మధ్య అతను తన ప్రయత్నాలు పూర్తిగా మానుకున్నాడు. కారణం...

బ్రహ్మానందంకి ఆఫీసులో ప్రమోషను వచ్చి ఎగ్జిక్యూటివ్ అయ్యాడు. ఆ కుర్చీలో బట్టతలతో కూర్చుని ఉంటేనే హుందాగా, నిండుతనంగా ఉంటుందని అతనికి అనిపించింది.

ఇప్పుడు బ్రహ్మానందం తన సీట్లో కూర్చుని అప్పుడప్పుడూ తళతళలాడే తన బట్టతలని చిద్విలాసంగా నవ్వుకుంటూ నిమురుకుంటున్నాడు.

* * *